క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ



దొండపర్తిలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ గొలగాని వీరారావు, నాయకులు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించాలని 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు అన్నారు. అమ్మపేరుతో ఒక మొక్క (ఏక్ పేడ్ మాకే నామ్) కార్యక్రమం వార్డులో నిర్వహించారు. బీజేపీ సాత్ కో–కన్వీనర్ కె.మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన సమాజం చేరువవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, నీలాపు విజయానందరెడ్డి, వార్డు టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, పాలికల సింహాచలం, జనసేన నాయకుడు గుండు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



లెప్రసీ హోమ్ వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు అందజేస్తున్న రాంబాబు తదితరులు

డాబాగార్డెన్స్ : మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులో గల ప్రేమసమాజం లెప్రసీ హోమ్‌లో గల వృద్ధులకు పార్టీ నాయకులు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. వారిచే జీవీఎల్‌కు ప్రార్థన చేయించారు. కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, మైనార్టీ మోర్చా సీనియర్ నాయకుడు చితకల రాజబాబు, మహిళా మోర్చా నాయకురాలు దశమంతుల సుశీల, మహారాణిపేట మండల అధ్యక్షుడు దేవర చంద్రశేఖరరావు, కార్యదర్శి జగదీశ్వరరావు, డి. శ్రీనివాసరావు, మంజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అల్లిపురం : శ్రీ వెంకటేశ్వరమెట్ట హౌస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శనివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 130 సంవత్సరాలుగా 1450, 1461 సర్వే నంబర్లలో నివసిస్తున్నామని అయితే ఎండోమెంట్ డిపార్టుమెంట్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలని వంశీని కోరారు. ఈ సమస్యపై దేవదాయ శాఖ అధికారులతో చర్చిస్తానని ఎమ్మెల్యే వంశీ వారికి హామీ ఇచ్చారు.విల్లూరి డాక్టర్ చక్రవర్తి, అసోసియేషన్ ప్రతినిధులు భీశెట్టి శ్రీనివాసరావు, శరగడం మోహన్‌రావు, సత్యారావు, సతీష్, సూరిశెట్టి శంకరరావు, కోరిబిల్లి త్రినాథ్, ఆది, కాండ్రేగుల మంగరత్నం, కొయిలాడ సుగుణ పాల్గొన్నారు.

4జీ, 5జీ సర్వీసులు అందుబాటులోకి తేవాలి

డాబాగార్డెన్స్ : దేశంలో గల 140 కోట్ల మంది ప్రజల ప్రయోజనాల కోసం బీఎస్ఎన్ఎల్ సేవలు ఎంతైనా అవసరమని, తక్షణమే బీఎస్ఎన్ఎల్‌కు 4జీ, 5జీ సర్వీసులు అందుబాటులోకి తేవాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఈసీహెచ్‌వీ సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జియో, ఎయిర్‌టెల్ సంస్థల అధిక టారీఫ్‌ల బారి నుంచి ఈ దేశ ప్రజలను కాపాడడానికి బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగ సంస్థకి ఆయా సర్వీసులు తక్షణమే కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోదీ నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వంలో కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ఈ మేరకు మెమోరాండం ఇచ్చినట్లు తెలిపారు. జరిగిందన్నారు. రిలయన్స్, జియో సంస్థలు పెంచిన చార్జీలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.



టౌన్ కొత్తరోడ్డులో ఇప్పటికీ ప్రారంభం కాని కల్వర్టు పనులు



ఏవీఎన్ కళాశాల డౌన్‌లో పూర్తి కావాల్సిన ఫుట్‌పాత్

నత్త నడకన.. విస్తరణ పనులు

ఇరుగ్గా ఉండే వన్‌టౌన్‌ను విస్తరించాలని పనులు ప్రారంభించారు. తొలుత పెద్ద ఎత్తున జరిగిన పనులు తర్వాతి కాలంలో ఎందుకో మందగించాయి. దీంతో రహదారులు.. ఫుట్‌పాత్‌లు.. కాలువల పనులు పూర్తి కాలేదు. నగరంలో ముఖ్యమైన వ్యాపార కేంద్రమైన ఈ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు పూర్తి కాకపోవటంతో స్థానికులు.. వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని వ్యాపారులు చెబుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



ఇప్పటికీ తుది మెరుగులు దిద్దుకోని వన్‌టౌన్ రహదారి

- పాతనగరం రహదారి వెడల్పులో జాప్యం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు.. వ్యాపారులు
- వ్యాపారంలో నష్టపోతున్నామని ఆవేదన

జగదాంబ : పాతనగరంలో రహదారి విస్తరణ పనుల్లో వేగం మందగించిందని స్థానికులు, వ్యాపారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పునకు సంబంధించి జీవీఎంసీ అధికారులు ఆక్రమణలు తొలగించి పనులు మొదలుపెట్టారు. తొలుత పనులు వేగంగానే జరిగాయి. జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు చేపట్టిన పనుల్లో ముందుగా జగదాంబ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు కాలువలు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ స్తంభాలతో పాటు ప్రధాన రహదారి (బీటీ రోడ్డు) నిర్మాణం కూడా వేగంగా జరిగింది. అయితే ఆ తర్వాత పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ రహదారి విస్తరణ పనుల కోసం రూ. 4.50 కోట్లు, కాలువలకు రూ. 4.50 కోట్లు, ఫుట్‌పాత్ నిర్మాణాలకు రూ.3 కోట్లు వెచ్చించింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా పనులు చేస్తూ వచ్చారు. అయితే టర్నర్ చౌల్ట్రీ వద్దకు వచ్చేసరికి ఎందుకు పనులు వేగంగా జరగడం లేదో అర్థం కావడంలేదని స్థానికులు.. వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు తాము తమ దుకాణాలు తొలగించామని.. రహదారి వెడల్పు పనులు పూర్తి అయితే తమ దుకాణాలను పునర్నిర్మించుకుంటామని చెబుతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో.. కొంత మేరే..

ముందుగా చేపట్టిన రహదారి విస్తరణ పనుల్లో జగదాంబ నుంచి వైజాగ్ సెంట్రల్ షోరూం వరకు పనులు పూర్తిస్థాయిలో జరిగాయి. అక్కడి నుంచి ఏవీఎన్ కళాశాల డౌన్ వరకు కాలువలు, ఫుట్‌పాత్ పనులు నిర్వహించారు. అక్కడి నుంచి చూస్తే టౌన్ కొత్తరోడ్డు, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు మాత్రం సగం సగం పనులు మాత్రమే కావటంతో విస్తరణ పనులు పూర్తిగా అవుతాయా అని స్థానికులు, వ్యాపారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారాలు సరిగ్గా సాగటంలేదు..

రహదారి విస్తరణ పనులు వేగంగా జరగకపోవడంతో సరిగ్గా వ్యాపారాలు జరగక నష్టపోతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. దుకాణాల ముందు సగం పూర్తి చేసిన కాలువల వల్ల వినియోగదారులు లోపలికి రాలేకపోతున్నారని వాపోతున్నారు. అలాగే రహదారి పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు కూడా రహదారి నిర్మాణ పనులు త్వరగా పూర్తి కాకపోవటం వల్ల తాము నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు పనులు వెంటనే పూర్తి చేయించాలని కోరుతున్నారు.

రేపు మహానేత వైఎస్సార్ జయంతి

- 8వ తేదీ నుంచి వైఎస్సార్‌సీపీ నూతన ఒరవడికి శ్రీకారం
- పేదల పక్షాన పోరాడుతాం
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : పేదల గుండె చప్పుడు, ఆరోగ్య ప్రదాత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో శనివారం దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు, మహానేత విగ్రహాలకు క్షీరాభిషేకంతో శుద్ధి చేసి నివాళులర్పిస్తామని తెలిపారు. పేదలకు వస్త్రదానం, అన్నదానంతో పాటు మరెన్నో సేవా కార్యక్రమా లు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

మహానేత జయంతి నాందిగా..

మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి నాందిగా ప్రజల పక్షాన నిలబడుతూ కొత్త ఉత్సాహంతో ఇకపై ముందుకు వెళ్తామని వాసుపల్లి చెప్పారు. పార్టీ నాయకులు కొండా రాజీవ్‌గాంధీ, మూగి శ్రీనివాస్ మాట్లాడుతూ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు చేసిన మంచిని చరిత్ర ఇంకా మర్చిపోలేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందివ్వడంలో ఎటువంటి పొరపాటు చేయలేదని, పార్టీ పరంగా ఉన్న లోపాలు విశ్లేషించుకుంటూ మరింత ఉత్సాహంతో ఉరకలు వేసేందుకు మహానేత జయంతి రోజున శ్రీకారం చుట్టనున్నామని వెల్లడించారు. సమావేశంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడూరు అప్పల రత్నం, కోడిగుడ్ల పూర్ణిమ, చెన్నా జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వారాహీ నవరాత్రులు ప్రారంభం



అనఘాలక్ష్మీదేవి

అల్లిపురం : భక్తులతో విశేష పూజలందుకుంటున్న అల్లిపురంలోని శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉన్మత్త వారాహి పూజను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. కార్యక్రమంలో విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, కంకణధారణ, ఉత్సవ సంకల్పం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో ఆలయంలో పది రోజుల వారాహి నవరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు ఉన్మత్త వారాహి పూజ, రెండవ రోజు ఆదివారం బృహత్ వారాహి పూజలో భాగంగా షోడశ లక్ష్మీ పూజ, సాయంత్రం అమ్మవారి హోమం, సోమవారం స్వప్న వారాహి పూజ, మంగళవారం కిరాత వారాహి పూజ, బుధవారం శ్వేత వారాహి పూజ, గురువారం ధూమ్ర వారాహి పూజ, శుక్రవారం మహా వారాహి పూజ, శనివారం వార్తాళి వారాహి పూజ, ఆదివారం దండిని వారాహి పూజ సందర్భంగా ఆలయంలో షోడశ లక్ష్మీ పూజ జరుగుతుందన్నారు. సోమవారం నవరాత్రి ముగింపు సందర్భంగా ఆది వారాహి మహాపూజ, ఉద్వాసన జరపనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

గీతా ప్రచార సాధకుడు ఎండూరికి ఘన సత్కారం

డాబాగార్డెన్స్ : గీతా ప్రచార సాధకుడు, ప్రచార సమితి వ్యవస్థాపకుడు, గీత గాన గంధర్వ ఎండూరి కృష్ణమూర్తిని స్వామి వివేకానంద సంస్థ శనివారం ఘనంగా సత్కరించింది. సంఘ సేవకుడు మట్టపల్లి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు చేతుల మీదుగా ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతా ప్రచార సమితిలో కోశాధికారిగా, అధ్యక్షుడిగా, ప్రస్తుతం గౌరవ అధ్యక్షుడిగా 25 ఏళ్లుగా సేవలందిస్తూ లక్ష మంది విద్యార్థులకు గీతా పారాయణం నేర్పించారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గజపతి స్వామి, పైడిరాజు, అప్పలకొండ, భానోజీరావు, నల్లరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ. 5.88 లక్షలు

డాబాగార్డెన్స్ : ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు శనివారం జరిగింది. వంద రోజులకుగాను రూ.5 లక్షల 88 వేల 77 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష ఆదేశాల మేరకు అల్లిపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో జీవీ రమాబాయి పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఎన్. అప్పారావు, డి. నాగేశ్వరరావుతో పాటు పలువురు సేవకులు పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ కళలపై అవగాహన

డాబాగార్డెన్స్ : పీవీజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు నిర్వహిస్తున్నామని ఆ ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్ పోలిశెట్టి తెలిపారు. నగరంలోని శ్రీ విశ్వ స్కూల్ ఆవరణలో శనివారం పాఠశాల పిల్లలకు ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఆత్మ రక్షణ విద్యలో శిక్షణ ఇస్తే భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళలు ఆత్మరక్షణ విషయంలో డిఫెన్స్ టెక్నిక్స్ తెలుసుకోవాలని సూచించారు. త్వరలోనే సముద్రంలో స్నానాలు చేసే వారి రక్షణకు కృషి చేసే జీవీఎంసీకి లైఫ్ జాకెట్లు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విశ్వ ఇనిస్టిట్యూట్ డీన్ సతీష్, చైర్మన్ ధర్మరాజుతో పాటు మార్షల్ ఆర్ట్స్ కోచ్ సందీప్, కల్యాణ్, అధిక సంఖ్యలో బాలికలు పాల్గొన్నారు.

పిల్లల్లో వచ్చే వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సమత

మహారాణిపేట : పిల్లల్లో వచ్చే అంటువ్యాధులను గుర్తించి సత్వర చికిత్స అందించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వి. సమత తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో పలు ప్రభుత్వ ఆస్పత్రులు,స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ స్టాఫ్‌కు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించడం, వివిధ పరీక్షలు చేసే విధానం, నవజాత శిశువును అంగన్‌వాడీల్లో నమోదు చేయడం, విద్యార్థుల పేర్లు కాలేజీ వరకు నమోదు చేయడం, పోషకాహార, జన్యు లోపాలు, బరువు తక్కువ పిల్లలు, నెలలు నిండక ముందే పుట్టిన పిల్లలు, మెల్ల కన్ను, పెదవి చీలిక లేదా అంగటి చీలిక, వంకర పెదాలు, కంటి శుక్లాలు, వినికిడి లోపాలు, గుండె సంబంధిత వ్యాధులను గుర్తించి సత్వర చికిత్స అందించడంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయలేని వారికి కేజీహెచ్‌లోని సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ), ఓపీ నంబర్ 33 కేంద్రానికి రిఫర్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వి. సంధ్యారాణి, బి.సాయి కిరణ్, ఈ.శాంతిప్రియ, డాక్టర్ హీనా దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 16 రోజుల పండగ



16 రోజుల పండగలో పాల్గొన్న ముత్తయిదువులు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం గత జూన్ 21వ తేదీన వైభవంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా శనివారం ఆలయ అర్చకుడు భార్గవ శర్మ శైవాగమన సంప్రదాయంలో మంగళధ్వని, వేదమంత్రోచ్చరణలతో 16 రోజుల పండగను అద్భుతంగా జరిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించిన అనంతరం ముత్తయిదువులకు తాంబూలాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ వినియోగం తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్

మహారాణిపేట : మోటారు వాహనాల చట్టం, హెల్మెట్ వినియోగంపై ఆంధ్రా మెడికల్ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ, జిల్లా న్యాయ సేవల అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు హెల్మెట్ వినియోగం గురించి వివరించారు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ జడ్జి ఎంవీ శేషమ్మ, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శాంతి కల్యాణం



పూర్ణాహుతి నేత్రోత్సవంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు

డాబాగార్డెన్స్ : జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి ఆలయంలో ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం బలభద్ర, సుబద్ర సమేత జగన్నాథుడ్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యులు, రంగనాథాచార్యులు, యేడిద సురేష్, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.13.9 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శివజ్యోతి సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలోని శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు శనివారం జరిగింది. దేవదాయ శాఖ తనిఖీదారు వి.వసంతకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 21 రోజులకు గాను రూ.13.93 లక్షల నగదు, 142 గ్రాముల వెండి, 104 యూఎస్ఏ డాలర్లు, 111 ఎస్‌బీఐ చెక్కులు వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీష తెలిపారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోళన్, శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, డి.ఎస్. ప్రసాద్, భక్తులు, బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ విజేతలు విజయనగరం, హనీ గ్రూప్



ఇన్‌స్టిట్యూషనల్ విజేత హనీ గ్రూప్ జట్టు



డివిజన్ లీగ్ విజేత విజయనగరం జట్టు

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా క్రికెట్ సంఘం వార్షిక డివిజన్ లీగ్ పోటీల్లో విజయనగరం, గెలాక్సీ జట్లతోపాటు డివిజన్ ఇన్‌స్టిట్యూషన్ లీగ్ విజేతలు ట్రోఫీలందుకున్నాయి. శనివారం నిర్వహించిన వార్షిక బహుమతి ప్రధానోత్సవంలో తొలి డివిజన్ విజేతగా విజయనగరం జిల్లా జట్టు నిలవగా, రన్నరప్‌గా గెలాక్సీ సీసీ నిలిచింది. రెండో డివిజన్‌లో ఈకోర్సా, కౌంటీ సీసీ జట్లు, మూడో డివిజన్‌లో స్టీల్‌ప్లాంట్, సోలోస్ జట్లు, నాలుగో డివిజన్‌లో ఉషోదయ సీసీ, మూన్ స్టార్స్ జట్లు, ఐదో డివిజన్‌లో రైజింగ్ బ్లూస్, యూసీసీ జట్లు, ఆరో డివిజన్‌లో వాల్తేర్ నైట్స్, లెజండ్స్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. ఇన్‌స్టిట్యూషన్ లీగ్‌లో హనీ గ్రూప్, సిటీ పోలీస్ జట్లు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. స్థాయి ఆధారంగా ఆరు డివిజన్లుగా పోటీలు నిర్వహించగా తొలి డివిజన్‌లో తపస్వి బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా, మనీష్ బెస్ట్ బౌలర్‌గా, ఎస్వీ రాహుల్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచారు. ఈశ్వర్, చరణ్, సుమీత్ రెండో డివిజన్‌లో, యశస్వి, శ్రీనివాస్, సతీష్ మూడో డివిజన్‌లో, రాజు, నాగార్జున, అనిల్‌కుమార్ నాలుగో డివిజన్‌లో బెస్ట్‌గా నిలిచారు. సతీష్, హరీష్, హేమంత్ ఇన్‌స్టిట్యూషనల్ లీగ్‌లో బెస్ట్‌గా నిలిచారు. వైఎస్ఆర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ, కార్యదర్శి పార్థసారథి బహుమతి ప్రదానం చేయగా సంఘం ప్రతినిధులు సుధాకర్, టీఎస్ఆర్ ప్రసాద్, ఎస్ఎస్ ప్రసాద్, జేకేఎం రాజు, సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



కొబ్బరితోటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నూకాంబికా సంక్షేమ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : నియోజకవర్గ పరిధి 36వ వార్డు రంగిరీజువీధిలో గల స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి సంఘ సంస్కర్తగా చేపట్టిన అనేక కార్యక్రమాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరితోటలో..

అల్లిపురం : బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం కొబ్బరితోట నూకాంబికా అమ్మవారి ఆలయం సమీపంలో గల ఆయన విగ్రహానికి శ్రీ నూకమాంబ సంక్షేమ సేవా సంఘం సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సంఘం ప్రతినిధులు యాణంగి వేణు, తెలుగుచర్ల కనకరాజు, రాయి అప్పారావు, రాయి చిన్నా, యాణంగి శివ, చెవ్వేటి అప్పారావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

డాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ వైజాగ్ ఎలిట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ వైజాగ్ ఎలిట్ అధ్యక్షుడు రాఘవేంద్ర మిశ్రా, కార్యదర్శి రమణారావు, సంఘ సేవకులు భాస్కర్ వర్మ, జైన్ తదితరుల ఆధ్వర్యంలో ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైద్య సేవలకు తగ్గట్టుగా రక్తనిల్వలు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 2024–25 ఏడాదికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా రాఘవేంద్ర మిశ్రా, కార్యదర్శిగా టీవీ రమణారావును సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాథోర్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకి అభినందనలు

అల్లిపురం : గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే వంశీని మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి తన సహకారం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్ కుమార్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ అనిమిరెడ్డి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీ అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, జాయింట్ సెక్రటరీ చింతకాయల బంగార్రాజు, సురేంద్రరాజు, ఒమ్మి వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.